క్లుప్తంగా

మైనార్టీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మైనార్టీలు స్వయం ఉపాధి రుణాల కోసం ఈనెల 9వరకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో జనవరి 5వ తేదఅఈ ఉన్న గడువు ప్రభుత్వం 9వరకు పెంచినట్లు తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్లను ఎంపిక చేసుకొని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ధర్నాకు తరలిన కాంగ్రెస్ నాయకులు

లింగాల: ప్రభుత్వం పత్తి పంటకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులురాథోడ్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి ధర్నాలో పాల్గొన్నారు.

ఎత్తంగట్టుకు రోడ్డు పనులు ప్రారంభం

కోడేరు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎత్తం గట్టుపై వెలిసిన రామలింగేశ్వరస్వామి దర్శనం కోసం గట్టుపైకి రోడ్డు విషయమై గ్రామస్తులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణానికి రూ.25లక్షలు నిధులు మంజూరు చేయడంతో శుక్రవారం ఎత్తం గ్రామ యువకులు రహదారి పనులు ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు.

క్యాలెండర్ల పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్‌ను పట్టణానికి చెందిన కాల్వగడ్డ పావతి, శిధర్ రెండు వందల క్యాలెండర్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నూరుద్దీన్, ఉపాధ్యాయుడు కృష్ణప్రసాద్ ఉన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించండి

కోడేరు: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, హెల్త్‌కార్డులతో పాటు జాయినింగ్ కాపీలను ఇవ్వాలన్నారు.

కంటి వైద్యశిబిరం

కోడేరు: మండలంలోని రాజాపూర్, రేకులపల్లి తండాలో మిత్ర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ ఆంజనేయులు తెలిపారు. 150 మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లీలావతి, ఉపసర్పంచ్ బాలకిష్టయ్య, సిబ్బంది వెంకటేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల మండల కమిటీ ఎన్నిక

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడిగా రమేశ్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల సమస్యలపై పోరాడుతామని తెలిపారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థినికి అస్వస్థత



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థిని వరలక్ష్మి అస్వస్థతకు గురైంది. ప్రవళిక అనే విద్యార్థిని తరగతి గదిలో కళ్లు తిరిగి పడిపోయింది. గమనించిన తోటి విద్యార్థిని హేమలత ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చింది. వైద్యులు పరీక్షించి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటే వెంటనే ఆక్సిజన్ అందించారు. విద్యార్థిని బలహీనతతో ఉండటంతో తరుచూ కళ్లు తిరిగినట్లు అవుతుందని, రక్త నమూనాలు తీసుకుని తదుపరి చికిత్స అందిస్తామని వైద్యులు చెప్పారు. విద్యార్థిని పట్టణంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ చదువుతోంది.

వివాహిత అదృశ్యం

అచ్చంపేట రూరల్: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన అచ్చంపేటలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ వివాహిత ఈనెల 3న అచ్చంపేటకు బంధువుల ఇంటికి అని చెప్పి వచ్చింది. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన కొల్లాపూర్‌లో పర్యటించారు. సోమశిల గ్రామానికి చెందిన మునగాల రాముడుకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.3.40లక్షల చెక్కును అందజేశారు. 17వ వార్డులో ప్రధాన మురుగు కాల్వపై నూతనంగా నిర్మించిన కల్వర్టు, రేలింగ్ పనులను పరిశీలించారు. 11వ వార్డు కౌన్సిలర్ బోరెల్లి కరుణ మహేష్ ఏర్పాటు చేసిన మంజునాథ ఇంటర్‌నెట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, బండల వెంకటస్వామి, రుక్మొద్దీన్, నిరంజన్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్లలో హైమాస్ట్ లైట్లు, ఫీడర్ ఛానల్ పనులను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పల్లెప్రగతి నిధుల నుంచి లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు వీరమనాయిని చెరువుకు సాగునీరు అందించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్, సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ రజిత, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న స్కీం వర్కర్లు, సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: పథకాలను ప్రభుత్వం ప్రైవేటీకరించాలన్న ఆలోచనను విరమించుకొని, స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట స్కీం వర్కర్లతో ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయ అధికారంలోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 8సంవత్సరాలు అవుతున్నా స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా స్కీం వర్కర్ల వేతనాలు కూడా పెంచి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్ 5న ఢిల్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్దం పర్వతాలు, జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనంగా నెలకు రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట స్కీం వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి దశరథం, కళావతి, శ్రీదేవి, నిర్మల పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి..

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న స్కిం వర్కర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన స్కిం వర్కర్లు మధ్యాహ్న భోజన సమయంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో బాల్‌రాజు, మల్లయ్య, బాల్‌రెడ్డి, మాసమ్మ, జయమ్మ తదితరులు ఉన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి

చారకొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మర్రిపల్లి సర్పంచ్ నరేష్‌నాయక్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో బీఆర్‌ఎస్ మహిళా కార్యవర్గాన్ని సర్పంచ్ నరేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పద్మ, ప్రధాన కార్యదర్శిగా మాలతితో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, గణేష్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తకుంటపల్లిలో..

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లిలో శుక్రవారం సర్పంచ్ పర్వతాలు, సింగిల్ విండో డైరెక్టర్ బాలరాజుగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అరుణ, ఉపాధ్యక్షురాలిగా ఈశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శిగా శారద, కోశాధికారిగా చెన్నమ్మ, కార్యదర్శిగా తిరుపతమ్మ, మరి కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుర్మయ్య, నాయకులు రాజు, సుల్తాన్ పాష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ర్యాలీ

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు రక్షణ కరువైందని, ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి అచ్చంపేటలో ఉపాధ్యాయులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని నినాదాలు చేశారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని బహుజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక నోడల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, గతంలో ప్రభుత్వమే మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయకోవడం శోచనీయం అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్టీఫెన్, పరుశరాములు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన గంగాపుర శేఖర్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. అనారోగ్యానికి గురైన శేఖర్ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. పేద కుటుంబం కావడంతో సీఎంఆర్‌ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో చెక్కు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, కృష్ణ, భూక్యానాయక్, దేవయ్య, భీస్మాచారి తదితరులు ఉన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ముగ్గులు వేసి అలరించారు. ఉత్తమ ముగ్గులను వేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజహాన సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖాజాబీ, అధ్యాపకులు ఉమాదేవి, వనిత, అనిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగుపై అవగాహన

లింగాల: మండల వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం 'డ్రమ్ సీడర్' పద్ధతిలో వరిసాగుపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ నరేష్ సాగు విధానం గురించి రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. మండలంలో డ్రమ్‌సీడర్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇలాంటి పద్ధతిలో వరి సాగు చేపట్టాలనుకునే రైతులు మండల వ్యవసాయ శాఖను సంప్రదిస్తే పూర్తి సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పీఆర్‌టీయూ టీఎస్ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దు అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని అభ్యర్థి చెన్నకేశరెడ్డి అన్నారు.

చెంచుపెంటల్లో పశువైద్య శిబిరం

మన్ననూర్: నల్లమల లోతట్టు ప్రాంతం అప్పాపూర్ గ్రామం భౌరాపూర్, మేడిమల్కల చెంచుపెంటల్లో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పశువులకు సంభవించే గొంతువాపు, జబ్బ వాపు, గాలికుంటు వ్యాధి నివారణకు టీకా ఇచ్చారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అధికారి జీవి రమేష్ మాట్లాడుతూ పశువులు, మేకలు, కోళ్లకు వ్యాధులు వచ్చినప్పుడు గమనించి వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలగురువయ్య, డీటీడీఓ కమలాకర్, ఐటీడీఏ అధికారి జాఫర్ ఉసేన్, వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, అనిల్ వెంకటేష్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



టీఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ



కందనూలు: టీఎన్‌జీఓ యూనియన్ నూతన సంవత్సరం టేబుల్ క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగులంతా సమష్టిగా పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేష్, ఎండీ షర్ఫుద్దీన్, ఎండీ నజీర్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో..

మన్ననూర్: ఆర్యవైశ్యుల కుల దేవత శ్రీ కన్యకా పరమేశ్వరీ క్యాలెండర్‌ను శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, వెంకటరమణ, సత్యనారాయణ, శ్రీనివాసులు, భాస్కర్, బాల్‌నారాయణ, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కందనూలు: జర్నలిస్టులకు అండగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నిలిచిందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లాఖాన్ అన్నారు. ఈనెల 8న హైదరాబాద్‌లోని పటాన్ చెరువు జీఎంఆర్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర ద్వితీయ మహాసభల వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘం నిరంతరం పాటు పడుతుందని అన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు దినకర్ రావు, చంద్రశేఖర్ రావు, విజయ్, అహ్మదుల్లా ఖాన్, రాజేష్ గౌడ్, ప్రదీప్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, రమేష్, యాదయ్య, కపిలవాయి రాజు తదితరులు పాల్గొన్నారు.



నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



గుంతకోడూరులో మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీఓ గంగామోహన్

తాడూరు: హరితహారం కార్యక్రమంలో ఆయా ప్రాంతాల్లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గుంతకోడూరు గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి కార్యదర్శి వెంకటయ్యకు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం శ్మశానవాటిక సందర్శించి ప్రతి శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కకు నీటిని అందించాలని సూచించారు.

చారకొండ: నర్సరీ నిర్వహణపై శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లిలో శుక్రవారం ఎంపీడీఓ నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో ప్రైమరీ బెడ్లను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి ఉపాధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ వాస్‌దేవ్ ఉన్నారు.

వెల్దండ: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్ పేర్కొన్నారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా కొట్ర, రాచూర్, తిమ్మినోనిపల్లి, బైరాపూర్ గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలను పరిశీలించారు. మొక్కలకు నీరు అందించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేస్తున్న నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట టీఏ సత్యనారాయణ, కార్యదర్శి బాలస్వామి ఉన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

అచ్చంపేట: పట్టణంలోని 15వ వార్డు సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. శుక్రవారం ఉట్లకోనేరు ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలు వివరించారు. వార్డులో మురుగు కాల్వలు, సీసీ రోడ్డు పనులు చేపడుతామని తెలిపారు. పతి రోజూ చెత్త ఆటో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, రెండు రోజులకోసారి రోడ్లు శుభ్రం చేయిస్తామని అన్నారు. ఉట్లకోనేరు ఉత్తర భాగం నుంచి పాడుపడిన రోడ్డును శుభ్రం చేయిస్తామని, సీసీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మనుప్రసాద్, శివ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న మున్సపల్ చైర్మన్ సత్యం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో నూతనంగా నిర్మిస్తున్న సెగ్రిగేషన్ షెడ్డును మున్సిపల్ చైర్మన్ సత్యం పరిశీలించారు. శుక్రవారం మున్సిపల్ ఏఈ శివకృష్ణతో కలిసి షెడ్డులో ఏర్పాటు చేసే అన్ని విభాగాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. త్వరలో షెడ్డును అందుబాటులోకి తీసుకొచ్చి బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారవేయటంతో వచ్చే ఇబ్బందులకు పరిష్కారం చూపాలని అన్నారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ బోజిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది శ్రీకాంత్ ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కొల్లాపూర్: మండలంలోని ముక్కిడిగుండం, నార్లాపూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ మాట్లాడుతూ ముక్కిడిగుడం, నార్లాపూర్ గ్రామాల నుంచి రోజూ వందమందికి పైగా విద్యార్థులు కొల్లాపూర్‌కు చదువుల కోసం వస్తుంటారన్నారు. ప్రజలు కూడా పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని వివరించారు. ఆర్టీసీ అధికారులను తమ గ్రామాలకు బస్సులు నడపాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈమేరకు కంట్రోలర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, భైరవ, కృష్ణవేణి, బాలు, చందు, వంశీ, వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ అభివృద్ధే ధ్యేయం



పాదయాత్ర నిర్వహిస్తున్న సుధాకర్‌రావు

కొల్లాపూర్: కొల్లాపూర్ అభివృద్దే తన ధ్యేయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ప్రగతి కోసం పాదయాత్ర శుక్రవారం కొల్లాపూర్ చేరుకుంది. పట్టణంలోని 8,12,13 వార్డుల గుండా పాదయాత్ర సాగింది. బీజేపీ జెండాను సుధాకర్‌రావు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కొల్లాపూర్‌కు జాతీయ రహదారి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న సోమశిల బ్రిడ్జి సాధించానన్నారు. ఇరవై ఏళ్ల పాటు పాలించిన మాజీ మంత్రి, నాలుగేళ్లుగా పాలన సాగిస్తున్న ఎమ్మెల్యే నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. జాతీయ ఖాదీబోర్డు కమీషన్ సభ్యులు పేరాల శేఖర్‌రావు మాట్లాడుతూ సుధాకర్‌రావు కొల్లాపూర్ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని, ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, రోజారమణి, శిరేఖ యాదవ్, సాయికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పార్టీ జెండా ఎగురవేశారు. పాదయాత్ర శుక్రవారం మల్లేశ్వరం చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు, కార్యకర్తలు సుధాకర్‌రావుకు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భరత్‌చంద్ర, మండల అధ్యక్షుడు ప్రసాద్, రోజారమణి, కేశవులు, ఖలీల్‌పాష, వెంకటస్వామి, విష్ణు, మాసూం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డిపో మేనేజర్ రాజేశ్వర్

కోడేరు: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మైలారంలో ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మశన్న, బాల్‌రెడ్డి, రామయ్య, జలెందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బస్సును నడపాలి

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీకాంత్ పాల్గొని ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలతో పాటుగా ఫిర్యాదులను స్వీకరించారు. వంగూర్ మండలంలోని ఉల్పర గ్రామం నుంచి హైదరాబాద్‌లోని బీఎన్ రెడ్డినగర్‌కు ఇక్కడి గ్రామాల మీదుగా బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని రాజవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి కోరారు. ప్రయాణికుల నుంచి మరే ఫిర్యాదులు, సలహాలు రాలేదని, డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు. కార్యక్రమంలో డిపో వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన యువకుడికి మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేయూత అందించారు. భగత్ సింగ్‌తండాకు చెందిన రవినాయక్ అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

తాడూరు: తెలంగాణలో త్వరలో నిర్వహించే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ మండల ఇన్‌చార్జ్ కొండా నాగేశ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని పర్వతాయిపల్లి, తుమ్మలసూగూరు గ్రామాల్లో గ్రామ స్థాయి కమిటీలను ఎంపిక చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామ కమిటీలు ఎంపిక చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లోహిత్ రెడ్డి, నాయకులు బాలు, యాదయ్య పాల్గొన్నారు.

సిద్ధంగా ఉండాలి..

లింగాల: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని అచ్చంపేట నియోజకవర్గ బీజేపీ పాలక్ అందె బాబయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సలేశ్వరం అధ్యక్షతన బూత్ కమిటీల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు శ్రీకాంత్‌భీమా, గోవర్ధన్‌రెడ్డి, రేణయ్య, కొండల్‌రెడ్డి, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ భాస్కర్‌రెడ్డి శుక్రవారం సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు విద్యాబోధనపై అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.